107)గుండక్రియ

ప॥ ఏపురాణముల నెంత వెదికినా । శ్రీపతిదాసులు చెడ రెన్నడును ॥

చ॥ వారివిరహితములు అవి గొన్నాళ్ళకు । విరసంబులు మరి విఫలములు ।
నరహరి గొలిచిటు నమ్మినవరములు । నిరతము లెన్నడు నెలవులు చెడవు ॥

చ॥ కమలాక్షుని మతిగాననిచదువులు । కుమతంబులు బహుకుపథములు ।
జమళి నచ్యుతుని సమారాధనలు । విమలములే కాని వితథముగావు ॥

చ॥ శ్రీవల్లభుగతి జేరనిపదవులు । దావతులు కపటధర్మములు ।
శ్రీవేంకటపతి సేవించునేవలు । పావనము లధిక భాగ్యపుసిరులు ॥